తెలుగు కథ

—ఎ.పుష్పాంజలి

# నిట్టూర్చకు చంద్రుడా!

ఆమెను నేను పెళ్లిపీటల మీదే ప్రేమించాను.

అంతవరకూ ప్రేమంటే ఏమిటో నాకు తెలియదు. కానీ ఆమెని చూసిన మరుక్షణం, ఆమె నుంచి బయల్దేరిన ఏదో.. నన్ను తాకి ఒక్క ఊపు వూపేసింది.

అంతేనా? ఒకే పదార్థం రెండుగా విడిపోయి సగం ఆమెలోనూ, సగం నాలోనూ ఉండిపోయాయనీ, అవి కలుసుకోడానికి తహతహలాడుతున్నాయనీ అనిపించింది. ఈ రెండు ప్రగాఢ భావాలూ 'ఇదే ప్రేమంటే' అనే ఎరుకను నాకు కలిగించాయి.

ప్రేమకు తెలుసా.. ఆమెకు నా ప్రాణస్నేహితుడితో పెళ్లవుతోందని? కానీ వివేకానికి తెలుసుగా! అందుకే 'బిహేవ్ యువర్‌సెల్ఫ్' అని వార్నింగిచ్చింది.

ఆ సుందరి పేరు సుందరమ్మట. ఆమె కనుముక్కు తీరు నేవర్ణించలేను. చామనచాయతో ఉన్న ఆమెను దబ్బపండనో, పాలరాయనో ఎవరంటారు? ఆమె కళ్లని కలువరేకలని కూడా ఎవరూ అనలేరు కానీ, వాటిలో మానస సరోవర జలాల స్వచ్ఛత ఉంది. సంపెంగ తీరు ఎంతమాత్రం లేని ఆ ముక్కు.. గడుసుదనానికి ప్రతీక. ఆ చిన్న ముక్కుపుడక అటూ ఇటూ మెరిసినపుడు, దిక్కుల్ని తనలో లీనం చేసుకుంటోంది. బింబాధర కాదు కానీ, ఆ పెదవుల చివర విరుపులు.. హృదయాల్ని తమలో లీనం చేసుకోగల చమత్కారం కలిగి ఉన్నాయ్.

ఇది మా సూర్యనారాయణ మాస్టారు జరిపిస్తున్న సోషల్ మ్యారేజ్. అందుకే పెళ్లికూతురు సింపుల్‌గా ఉంది. పైగా, ఇది ఆదర్శ కులాంతర వివాహం కూడా.

పార్థుడు.. అంటే ఇప్పుడు పెళ్లికొడుకు స్థానంలో కూచున్నవాడు.. చిన్ననాటినుంచి నేటివరకూ నాకు జిగిరీ దోస్త్. స్నేహితుడి గురించి ఇలా చెప్పవచ్చో లేదో నాకు తెలియదు కానీ ఉన్న విషయం ఉన్నట్టు చెబుతున్నాను. వీడికి చిన్నప్పట్నించీ ఉన్న హాబీ ఏంటంటే, ఏవేవో పనికొచ్చేవీ పనికిరానివీ చేసేసి గుర్తింపు పొందాలనుకోడం.

విజయనగరం నుంచి నేను బయల్దేరానో లేదో కనుక్కోడానికి ఫోను చేసినప్పుడు "మాస్టారి మాట కాదనలేక ఒప్పుకున్నాను కానీ ఈవిడేం పెద్ద అందగత్తె కాదురా!" అన్నాడు.

అప్పటికి నేను సుందరిని చూడలేదు. ఐనా "ఒరే! నువ్వేమంత నలకూబరుడివని? " అన్నాను. వీడు సంఘంలో తన పేరు పెంచుకోడానికే పెళ్లికి దిగాడేమోనని అప్పుడే అనిపించకపోలేదు.

పెళ్లిపీటల మీద ఆమెను చూశాక నాలో కలిగిన అభిప్రాయానికి నా గుండె నివ్వెరపోతూ 'ఇది నేలమీద నడిచే కథ కాదు భాయ్! జాగ్రత్త' అంది.

నేలమీదా ఆకాశంలో నీళ్లల్లో ఎక్కడా నడవని కథలు.. హృదయాల్లో నడుస్తుంటాయని బాగా తెలిసినవాణ్ణి. ఈ కథను నడపాలంటే చాలా గుండె ధైర్యం కావాలి కానీ, ఆమెతో కథ నడపాలని నేననుకోలేదు.




పార్థుడూ నేనూ గుంటూర్లో ఎలిమెంటరీ నుంచీ క్లాస్‌మేట్సు. ఇప్పుడు వాడు గుంటూర్లో, నేను విజయనగరంలో ఉద్యోగాలు చేసుకుంటున్నాం. సుందరి కూడా బ్రాడీపేట ఇండియన్ బ్యాంకులో ఎంప్లాయీ అట.

ఆవాళ సాయంత్రమే తిరుగు ప్రయాణమైన నాకు కిటికీలోంచి పున్నమినాటి చంద్రుడు దర్శనమిచ్చాడు. చంద్రుడు విచారంతో నిట్టూర్పులొదులుతున్నాడెందుకో?

★ ★ ★



పెళ్లైన నెలనాళ్లకు ఎవరో బంధువులింటికి విశాఖ వచ్చిన పార్థుడు “ఒరే! నేనూ సుందరీ విజయనగరం వస్తున్నాం” అని ఫోన్ చేసి చెప్పాడు. “ఎవరింటికో అడగవేంటోయ్? ” అనీ అన్నాడు.

“ఎ..ఎ..వరింటికి? ” అన్నాను కంగారుగా.

వాడు బిగ్గరగా నవ్వి “మీ ఇంటికే” అని ఫోన్ పెట్టేశాడు.

నా గుండె గుభేలుమంది. ఈ బ్రహ్మచారి కొంపలో ఆమె ఉండగలదా? అసలు ఆమె, నేను ఒకే ఇంట్లో.. ఎలా సాధ్యం? ఆమెనుంచి వీచేగాలి దావానలంలా నన్ను దహించివేయదా? విరహంతో నేను శలభంలా కాలిపోనా?

భీముణ్ని పిల్చి “ఇప్పుడెలా? ” అన్నాను. మా భీముడికి అపారమైన స్వామిభక్తి. వాడి అసలు పేరు భీముడు కాదు. ఆకారానికి మాత్రం వాడు భీముడు. “నాలుగు రోజులు వంట సెయ్యడానికి అక్కాయిని రమ్మంటా సార్, అంతలోగా ఇల్లు సర్దేద్దాం” అన్నాడు.

నాకు నేనే భయపడ్తూ, స్టేషన్‌లో వాళ్లని రిసీవ్ చేసుకున్నాను. సుందరి వైపు చూడాలంటేనే భయం! ఇంటికొచ్చాక అందరం మాట్లాడుకుంటున్నప్పుడు, ఆమెను పరీక్షగా చూసిన నా గుండె జారిపోయింది. తను పెళ్లిపీటల మీద కూచున్నానన్న జంకులేకుండా అందరివంకా నిర్భయంగా చూస్తూ మాట్లాడుతున్న ఆనాటి ‘ఎలిగెన్సీ’ ఆమెలో లేదు. కళ్ళల్లో ఎంతో దిగులు మూటగట్టుకొచ్చింది.

ఏం జరిగింది? ఆనాటి సౌందర్యం ఏ తుపాన్లో కొట్టుకుపోయింది? సుందరి నాకేసి చూసినప్పుడంతా ‘నువ్వు తప్పు చేశావు’ అన్నట్టు గుచ్చి గుచ్చి చెపుతోంది కళ్లతో.

ఏం చేశాను నేను?

నా గుండెలో సుడిగుండాలు వెలుపలికి కనిపించకుండా ఎంతో జాగ్రత్తగా ఉన్నాను.

నేనూ పార్థుడూ బైటికెళ్తూ సుందర్ని కూడా మాతో రమ్మన్నాం. “మీరు వెళ్లండి. నేను వంట చేస్తాను” అంది ముక్తసరిగా. దార్లో “గురువుగారి మాట కాదన్లేక ఈ పెళ్లి చేసుకున్నాను కానీ.. మా వాళ్లంతా నన్ను వెలివేశార్రా” అన్నాడు విచారంగా.

నాకు తెలిసి మాస్టారు ఎవ్వరినీ ఏ విషయంలో బలవంతపెట్టరే! “నీకు నచ్చింది. పెళ్లి చేసుకున్నావు. మీరిద్దరూ ఒకరికి ఒకరుగా ఉంటే చాల్దా? ” అన్నాను మనస్ఫూర్తిగానే.

“ఏం నచ్చడమోలే. మావాళ్ల మాట విని ఉంటే, బోల్డంత కట్నంతో పాటు అద్భుతమైన అందగత్తె దొరికిఉండేది” అన్నాడు.

“పార్థా! నీకంత సీన్లేదులే. మరీ అద్భుతమైన అందగత్తెలను మామూలు మగాళ్లు భరించలేరు. ఆమె నీకు దొరకడం నీ అదృష్టం. పిచ్చి పిచ్చి ఆలోచనలు మాను” అన్నాను.

భోజనాల దగ్గర సుందరి కాస్త తేటపడ్డట్టు కనిపించింది. విజయనగర ప్రశస్తి గురించి తను చరిత్రలో చదివిన విషయాలన్నీ నన్నడుగుతోంది.

ఆమె అలా ఫ్రీగా మాట్లాడ్డం పార్థాగాడికి నచ్చనట్టు, ముఖానికి గంటు పెట్టుకుని కూచున్నాడు. తన భార్య పరాయి మగాడితో ఫ్రీగా మాట్లాడడం ఏ మగాడికి నచ్చుతుందిలే?

సుందరి నా ఇంట్లో కట్టలు కట్టలుగా ఉన్న పుస్తకాలన్నీ ఆత్రంగా చెక్ చేస్తూ, కొన్నింటిని చదవడానిక్కాబోలు పక్కన



పెట్టుకుంది. ఆ మధ్యాహ్నమంతా ఆమె అదే పనిచేస్తూ ఉంది.

పార్థుడు రూములో నుంచి ఆమెను పిలవడం, ఆమె వెళ్లకపోవడం నాకు తెలుస్తూనే ఉంది. కొత్తగా పెళ్లైన వాళ్ల మధ్య ఉండాల్సిన ఒక ముఖ్యమైన ఎలిమెంటేదో వాళ్లమధ్య మిస్సయినట్టనిపించింది నాకు. 'అలా నేనెందుకాలోచించాలి? నా ఆలోచనలు నాకనుగుణంగా మలుచుకుని సంతోషపడడానికా' అని నన్ను నేను ప్రశ్నించుకుంటే 'ఎంతమాత్రం కాద'నే సమాధానం వచ్చింది.

సుందరిమీద నాకు కలిగిన ఫీలింగ్స్ కేవలం నాకే స్వంతం. అది పూర్తిగా నా ఆంతరంగిక విషయం. మరెవ్వరితోనూ సంబంధంలేదు, ఎవ్వరికీ తెలియాల్సిన అవసరమూ లేదు. పార్థూ సుందరీల జీవితం సాఫీగా నడవాలని నేను మనసారా కోరుకుంటున్నాను. కానీ నాకు తెలియకుండా వాళ్లిద్దరూ రహస్యంగా కీచులాడుకుంటున్నారన్న అనుమానం కూడా కలిగింది నాకు.

సాయంత్రం పార్కుకెళ్లాం. స్నాక్స్ తేవడానికి పార్థుడు వెళ్లాక "మిమ్మల్నొక విషయం అడగాలి. నిజాయితీగా జవాబు చెప్తారా? " అంది సుందరి.

"అడగండి" ఆశ్చర్యపోతూనే అన్నాను.

"మీ స్నేహితుడి గురించి మీకన్ని వివరాలూ తెలుసా? " గుచ్చిగుచ్చి చూస్తూ అడిగింది.

"అన్నీ తెలుసుననే అనుకుంటున్నాను. ఏం? ఇంకేమైనా ఉన్నాయా? "

"అన్నీ తెలిస్తే మీరు సూర్యనారాయణ మాస్టారుకి ఆ విషయం చెప్పకపోవడం చాలా దుర్మార్గం" అంది కోపంగా.

"ఏ విషయం? " అన్నాను మరింతాశ్చర్యంగా.

"అది నా నోటితోనే చెప్పించాలా? " అంది రోషంగా.

"ప్లీజ్. అటువంటివి నాకేమీ తెలియవు.. చెప్పండి" అంటుండగానే, పార్థుడు పరుగెత్తుకొచ్చాడు. మా వంక అనుమానంగా చూస్తూ "ఏంట్రా నందూ.. అంత సీరియస్ డిస్కషన్? " అన్నాడు.

"సీరియస్సా? ఏమీ లేదు. సుందరిగారికి కళింగ సామ్రాజ్యం గురించి తెలుసుకోవాలని ఉంది" అన్నాను.

కానీ నా ముఖంలోని ఆశ్చర్యం, ఆందోళన, సుందరి తలొంచుకొని కూచోడం పార్థూ దృష్టిని దాటిపోలేదేమో!

ఆ తర్వాత మళ్లీ మేం ఏమీ మాట్లాడుకోలేకపోయాం. ఎప్పుడూ వాడు సోదంతా చెబుతూ ఉంటాడు. తన పక్కనొక అద్భుతమైన వ్యక్తి ఉందన్న స్పృహే లేదు వాడికి.

సుందరి నా ఇంట్లో తిరగడం, అన్ని వస్తువులూ ముట్టుకోడం, వంటచేసి వడ్డించడం.. వీటన్నింటిలో ఆమె బాడీ లాంగ్వేజ్ అంతా తన సొంతం అన్నట్టుగా ఉండడం, నాకు అపరిమితమైన సంతోషాన్నిచ్చింది.

కానీ ఏదో చెప్పబోయి చెప్పలేక, చెయ్యని తప్పుకి నన్ను బాధ్యుడ్ని చేసి ఆమె నాలో అంతులేని ఆందోళన మిగిల్చింది. పార్థుడికి తెలియకుండా విషయం ఆమెనుంచి రాబట్టడానికి నాకు నిముషాలు చాలు. కానీ ఎందుకు? వాడి మరుగున ఆమెతో ఒక రహస్య అధ్యాయం నడపడం ఎక్కడికైనా దారితీయవచ్చు. 'వాళ్ల కలతలెలాగైనా సర్దుకుంటాయి, అడ్జస్టయిపోతారు' అనుకుంటూ వాళ్లని సాగనంపాను.

★ ★ ★

ఇంటికొచ్చి వరండాలోని ఈజీ ఛైర్లో చారగిలబడేసరికి, ఎదురుగా పున్నమి చంద్రుడు పరమ జాలిగా నిట్టూర్పులు వదుల్తూ దర్శనమిచ్చాడు. నాకూ, ఈ నిట్టూర్పుల చంద్రుడికీ సుందరికీ ఏమిటి






సంబంధం? సుందరి వెళ్తున్నప్పుడు నాతో సరిగ్గా మాట్లాడలేదు. ఎటో చూస్తూ అన్యమనస్కంగా ఉంది. ఆమె సంతోషంగా లేదన్న విషయం స్ఫురించినప్పుడంతా నా మనసు కుంగిపోతూ ఉంది.

నన్నింకా బాధపెట్టే విషయం మరొకటి జరిగింది. లలిత సెలెక్షన్‌తో సుందరికి చీరకొన్నాను కానీ సుందరి ఆ చీర ఇక్కడే వదిలేసి వెళ్ళింది. అదీ నా దిండు కింద రహస్యంగా!

పెళ్లి చేసుకొమ్మని నన్ను బలవంతపెట్టే వాళ్ళెవరూ లేరు. ఆ మాటకొస్తే, పెళ్ళి ముఖ్యంగా దేనికోసం చేసుకుంటారో దానికీ తక్కువ లేదు నాకు. ఐనా నేను మాత్రం ప్రతిరోజూ సెక్స్ కోరుకునే జంతువుని కాదు. ఇలా అంటే జంతువుల్ని అవమానించినట్టే! పెద్ద అందగాణ్ణి కాకున్నా డిగ్నిఫైడ్‌గా ఉండే నా ప్రవర్తన చాలామంది అమ్మాయిల్ని ఆకర్షిస్తుంది. కానీ మనసులు దోచుకోడానికి ప్రత్యేకించి నేను ఏటెక్నిక్కులూ ఉపయోగించను.

లలిత నా కొలీగ్. సుందరికి చీర కొనాలంటే ఈర్ష్యగా చూస్తూ ఎన్నో ఆరాలు తీసింది. లలిత భర్త తాగుబోతు. ఆమె సంపాదనంతా పీక్కొని ఆమెను చావగొట్టేవాడు. పిల్లలకోసమే అతన్ని ఆమె తన దగ్గర ఉండనిస్తోంది.

ఉన్నట్టుండి "నీ ఇంటికొస్తున్నా" అంది లలిత.

"అంత పని చేయకు" అన్నాను.

నిజంగానే రాత్రి పదింటికి వానలో ఆటో దిగింది.

"నీకేం పిచ్చా? " అన్నాను.

"పిచ్చిపిచ్చిగానే ఉంది" అంది.

సుందరి నా మనసులో చొరబడ్డాక, నాలో అనూహ్యమైన మార్పులొచ్చాయి. సుందరొక్కటే నిజం, మిగతా అందరూ అబద్ధం! అందరు స్త్రీలూ బొమ్మలు, సుందరి మాత్రం జీవమున్న మనిషి అనిపిస్తోంది.

చాలాసేపు లలితకి నచ్చజెప్పి, బైక్ ఎక్కించుకుని, వాళ్ళింటికి దూరంలో వదిలేసొచ్చాను. 'నేనెందుకు మారాను? ఇంతకుముందులా మామూలు మగాడిలా ఉండడంలో ఎంత హాయి ఉండేది! ఇప్పుడిలా మారి నేను సాధించిందీ సాధించబోయేదీ ఏమీలేదు.. మనశ్శాంతి పోగొట్టుకోడం తప్ప!

సంవత్సరం తర్వాత ఒక కాన్ఫరెన్స్‌కు గుంటూరు వెళ్ళవలసి వచ్చింది. వెళ్లే ముందు పార్థుడికెన్నిసార్లు ఫోను చేసినా రిప్లై లేదు. ఇల్లు కూడా నాకు తెలియదు. కాన్ఫరెన్స్‌కొకరోజు ముందే గుంటూరు వెళ్ళాను. బ్రాడీపేట ఇండియన్ బ్యాంకు ముందు ఆటో ఆపి, సుందరమ్మ కోసం ఎంక్వయిరీ చేశాను.

ఆమె బైటికొచ్చింది. నన్ను చూసి ముఖం వెలిగిపోయింది. "కాసేపాగండి" అంటూ మళ్ళీ బ్యాంకులోకి వెళ్ళింది. తిరిగొచ్చి ఆటోలో కూచుంటూ, ఇంటి గుర్తులు చెప్పింది. దార్లో పార్థుణ్ని గురించి అడుగుతుంటే వివరాలు చెప్పకుండా మాట దాటేస్తూ, నన్ను గురించి వివరాలడగసాగింది. ఆమె ఆటోలో నా పక్కే కూచొని ఉత్సాహంగా మాట్లాడుతుంటే, నాకు మతిపోతోంది.

ఇల్లు చేరాక గుచ్చిగుచ్చి అడగ్గా "ఆయనొస్తారు. మీరు స్నానం చేసి రెస్ట్ తీసుకోండి" అంది.

ఆ ఇంటికి ఒకే బెడ్‌రూమ్, ఒకే బాత్రూమ్ ఉన్నట్టున్నయ్. స్నానం ముగించి "చాపా దిండూ ఇట్లా పడెయ్యండి. హాల్లో నడుం వాలుస్తా" అన్నాను.




"అవసరం లేదు. ఆ బెడ్‌రూంలోనే పడుకోండి. కుక్కర్ కూడా పెట్టేశాను" అంది.

★ ★ ★

టైము మూడైంది. నేను హాల్లో సోఫాలో కూచున్నాను. ఆమె నా ఎదురుగా కూచొని, ఎన్నో రోజుల తర్వాత మాట్లాడానికవకాశం వచ్చినదానికిమల్లే మాట్లాడుతోంది.

"ఆవేళ నాతో ఏం చెప్పాలనుకున్నావు? " అని అడగాలని ఉంది. ఆమె జీవితంలో నా ప్రమేయం క్లుప్తంగానే ఉండాలని నిర్ణయించుకున్నాను గనక, ఆ ప్రయత్నం విరమించుకున్నాను. "పార్థు ఈవాళ రాడా"?

"వస్తాడేమో? "

"అదేం జవాబు"?

"అదే జవాబు"

ఇదీ మా మధ్య జరిగిన చివరి సంభాషణ.

పార్థు లేకుండా నేనక్కడుండడం అందరికీ ఎంత హానికరమో తెలిసిన నేను "అరండల్ పేటలో స్నేహితులున్నారు" అని చెప్తూ బైటపడ్డాను. నేను బయల్దేరుతుంటే, సుందరి ముఖం వెలవెలపోవడం బాధగానే ఉంది. నిజానికి అరండల్‌పేటలో నాకు తెలిసిన వాళ్లెవ్వరూ లేరు. ఎనిమిదివరకూ రోడ్లుపట్టి తిరిగాక సుందరి నెంబరుకి ఫోన్‌చేసి "పార్థుడొచ్చాడా? " అని అడిగాను.

"లేదింకా. మీరెక్కడ? వస్తున్నారా? " అంది.

"వస్తున్నాను. మీరు భోంచేసి పడుకోండి. లేటవుతుంది" అన్నాను.

పార్థుడిహ ఈ రాత్రికి రాడన్న విషయం నాకర్థమైంది. 'ఒకవేళ వాడు ఏ అర్ధరాత్రికో వచ్చినా, ఆ సమయంలో నేనక్కడెదురుపడితే ఎంత అసహ్యంగా ఉంటుంది! అదీకాక.. నేనక్కడే ఉండి, నాకు నేను శీల పరీక్ష పెట్టుకోవడం ఎందుకు? ' అనుకుంటూ ఒక హోటల్లో రూం తీసుకున్నాను. ఆవేళ రాత్రికి నాక్కావలసిన వస్తువులతో పాటు రేపు కాన్ఫరెన్స్‌కి వేసుకోవడానికి ఎమ్.ఎమ్.లో డ్రస్ కొన్నాను. బెడ్ మీద పడుకొని ఆలోచిస్తున్నాను. కిటికీలోంచి చంద్రుడు నన్ను చూసి కోపంగా నిట్టూరుస్తున్నాడు.

ఒక మగాణ్ని ఇష్టపడ్డ ఆడది, కొన్ని సందర్భాల్లో ఎంతలా ప్రవర్తిస్తుందో నేనెరగంది కాదు. కానీ సుందరి ప్రవర్తనలో అదేమీ లేదు. ఎంత స్వచ్ఛంగా ఉందామె ప్రవర్తన! సుందరిపైనుంది ఉత్త మోహమే అయితే, ఈ రాత్రికి నేనక్కడుండి అది తీర్చుకోవచ్చు. కానీ నేనామెను ప్రేమిస్తున్నాను, గౌరవిస్తున్నాను.

సుందరి ఫోను.. నా కలత నిద్రను భంగంచేసింది.

"ఒక్క విషయం చెప్పండి. మీరెవరికి భయపడ్తున్నారు? మీకా? నాకా? "

"భయమెందుకు? " అన్నాను భయంగా.

"అది మీకే తెలియాలి. మీరు చదివే పుస్తకాలు చూసి, మీరు యావరేజి మనిషి కాదన్న విషయం అర్థం చేసుకున్నాను. కానీ మీరిలా..? "

"క్షమించండి. మీ ఇద్దరి కోసం.."

"ఊహూ. అది వర్కవుట్ కాదు" అంది దృఢంగా.

ఆ రాత్రి నేనింక నిద్రపోలేకపోయాను.

రెండోరోజు నా కాన్ఫరెన్స్.. హోటల్ నాగార్జునలో సక్సెస్‌ఫుల్‌గా జరిగింది. అక్కడికే వచ్చాడు పార్థుడు. వాడితో కలిసి ఇంటికెళ్లాను. సుందరి బ్యాంకుకెళ్లిందట. నన్ను ట్రైయినెక్కిస్తూ "ఒరే నందూ!





నీకు చాలా విషయాలు చెప్పాలి. నేనింక ఆవిడతో కాపురం చేయలేనురా" అన్నాడు.

"ఏం? ఎందుకలా అంటున్నావ్? "

"ఆమె అందరితో చాలా క్లోజ్‌గా మూవవుతుంది"

"ఏడ్చావ్. ఆమె నీలా నలుగురితో తిరిగే ఒక ఉద్యోగి అని మర్చిపోకు. పిచ్చి పిచ్చి ఆలోచనలు మానేసెయ్. ఆమె చాలా మంచిది. అర్థం చేసుకో" అన్నాను.

వాడదో మాదిరి ముఖంపెట్టి "ఏంటోయ్! ఆమె తరఫున మాట్లాడుతున్నావు. ఏం? ఆవేళ నేను లేనప్పుడు నీతో కూడా.." అంటూ ఆపేశాడు.

"ఛీ.. నీచుడా.."

అంతలో బండి కదిలింది.

★ ★ ★

ఎదురుగా రూంలో తలుపులు తీసుకొనే నిద్రపోతోంది సుందరి.

మధ్య హాల్లో సోఫాలో కూచుని చదువుకుంటూ, అప్పుడప్పుడూ ఆమెకేసి చూస్తు ఉన్నాను.

గుంటూరొదిలి వచ్చినప్పటి నుంచి చెప్పలేని అశాంతి. చికాకు నాకు. నా ప్రమేయం లేకుండానే, నేను చిక్కుముళ్లలో ఇరుక్కుపోయాను. ఆ మధ్య మాస్టారు ఫోన్‌చేసి "నందూ! వాళ్ల సంసారం సజావుగా సాగడంలేదు. వీడుత్త అనుమానప్పిశాచి. పాపం సుందరి అలాంటిది కాదు" అన్నారు. ఇది నేనూహించిందే. కానీ నేను బాధపడేది ఆమె పరిస్థితి ఊహించుకొని.

'నేనేమీ చేయలేని బలహీనుణ్ణి, దద్దమ్మని. గుంటూర్లో ఉన్నప్పుడు కనీసం ఆమె చెప్పింది వినే ధైర్యం కూడా నాకు లేకపోయింది' అని నన్ను నేను తిట్టుకుంటూ ఉండగానే సుందరిక్కడికి వచ్చేసింది. వచ్చినప్పట్నించీ నన్ను చూసినపుడంతా ఓ శుష్క మందహాసం తప్ప ఏమీ మాట్లాడడం లేదు. నేనూ ఏమీ అడగడం లేదు తనని. ఇక్కడికి రావడం తన జన్మహక్కన్నట్లుగా ఆమె, ఇది చాలా మామూలు విషయం అన్నట్టుగా నేనూ, అంతా అర్థం చేసుకున్నవాడికిమల్లే భీముడూ ప్రవర్తిస్తున్నాం.

వచ్చినప్పటినుంచీ సుందరి చేస్తున్న పనల్లా.. ఎన్నో రోజులు లంఖణాలు తీసిన దానికిమల్లే భోంచేయడం, నిద్ర ముఖం ఎరుగనిదాన్లా నిద్రపోవడం.

నాలుగోరోజు ఉదయం నేను నిద్రలేవక ముందే, బైటెవరో గట్టిగట్టిగా అరుస్తున్నారు. ఎవరా అని బైటికెళ్లి చూశాను.

ఆ వచ్చి అరుస్తున్నవాడు పార్థుడు. వాడి పెళ్లాన్ని నేను లేపుకొచ్చానని బండ బూతులు లంకించుకొన్నాడు.

"పార్థూ! లోనికి రారా. మాట్లాడుకుందాం" అన్నాను ఓర్పుగా.

"నీతో నాకేంటిరా మాటలు? దొంగ.." అంటూ అదే బూతుపురాణం కంటిన్యూ చేశాడు.

జనం మూగుతున్నారు.

ఎప్పుడొచ్చిందో సుందరి నా పక్కనే నిలబడి "నోర్ముయ్! ఆయన్నేమన్నా అన్నావో మర్యాద దక్కదు. నీ పెళ్లాం ఇక్కడెవరూ లేరు ఫో" అని అరిచి అప్రయత్నంగా నా చెయ్యి పట్టుకుంది. ఆమె నా చెయ్యలా పట్టుకోవడంతో, నేను మరో లోకంలోకి వెళ్లిపోయాను.

భీముడు రంగంలోకి దూకడం, పార్థుని నెట్టుకుంటూ వీధి చివరికి తీసుకుపోవడం కనిపిస్తోంది.

పార్థూ పరిస్థితి నాకు విచారం అనిపించింది. ఆమెకేసి చూశాను. వెంటనే నా చెయ్యి వదిలేసి "క్షమించండి నందూ! నావల్ల మీకూ.." అంటూ ఆగింది.

'మీ కష్టంలో పాలుపంచుకునే హక్కు నాకుంది' అందామనుకున్నాను. మాట గొంతులోనే ఆగిపోయింది.

నేను మామూలుగా ఆఫీసుకెళ్తున్నాను. ఆవాళే సుందరి అన్న కృష్ణమూర్తి హైదరాబాద్ నుంచొచ్చాడు. అతన్ని నేను పెళ్లిలో చూశాను. "క్షమించండి నందగోపాల్ గారూ! మీకు చాలా శ్రమ ఇచ్చాం. సుందూ హైదరాబాద్ రాకుండా విజయనగరం ఎందుకు వెళ్లిందా అని ఆశ్చర్యపోయాను మొదట. కానీ మీరు తనకి చాలా మంచి మిత్రులటగా" అన్నాడు.

"అవునా? " అంటూ ఆమె వంక చూశాను. చిన్నగా నవ్వింది.

"రేపు రాత్రి బండికి వెళ్లిపోతాం" అన్నాడు కృష్ణమూర్తి.

మరుసటిరోజు ఆఫీసయినాక, ఇంటికి రాకుండా రాత్రి ఎనిమిది వరకూ



పార్కులో గడిపాను. తర్వాత ఇద్దరు ముగ్గురు స్నేహితులకు ఫోనుచేసి పిలిపించుకొని, హోటల్లో అదీ ఇదీ తింటూ పది వరకూ గడిపాను. సుందరి వెళ్లడం నేను చూడలేను. శోభంతా మటుమాయమైన జీవితం నేనూహించలేను. 'ఆమె నాతో మాట్లాడనక్కర్లేదు, నన్ను ప్రేమించనక్కర్లేదు. అలా నిద్రపోతూ ఆ రూములో ఉండిపోయినా చాలు.'

హోటల్లోంచి బైటపడ్డాక, మాస్టారి ఫోనొచ్చింది. "ఒరే నందూ! నిద్రపోతున్నావా? నేచెప్పేది జాగ్రత్తగా విను. ఇక్కడ పార్థూగాడు సుందరి నీతో వెళ్లిపోయిందని ప్రచారాలు మొదలెట్టాడు. ఐతే అదెవ్వరూ నమ్మడం లేదనుకో. అసలు నిజం నీకు చెప్తే ఆశ్చర్యపోతావు"

"ఏంటి మాస్టారూ అది? "

"మొన్న డాక్టరు సత్యానంద కలిశాడు. పార్థూ ఇంపొటెంటనీ, ఆ ప్రాబ్లమ్ క్యూర్ చేసుకోవడానికి మందులకోసం తరచూ ఆయన్ని కలిసేవాడనీ. కానీ అది క్యూర్ కాని ప్రాబ్లమ్ అని సత్యానందచెప్పాడు."

ఆశ్చర్యం- కాదు.. విచారం- కాదు.. ఆందోళన. ఆ స్థితిలోనే ఇల్లు చేరాను. భీముడు వరండాలోనే నిద్రపోతున్నాడు. హాలు తలుపు తెరిచే ఉంది. భీముడు రోజూలా లోపల పడుకోలేదెందుకు? నా రూంలో లైటు వెలుగుతూ ఉంది. సుందరి గది చీకటిగా ఉంది. నా రూం తలుపునెట్టి చూసి.. ఆశ్చర్యపోయాను!

మంచంమీద మల్లెలు, రోజాలు, అంతా అగరొత్తుల వాసన, పక్కనే స్వీట్సూ, పళ్లూ. 'ఏంటిది? ఎక్కడికొచ్చాను? '

"ఇది మీ గదే" పాలగ్లాసుతో లోపలికొస్తూ అందామె.

"సుందూ!" అన్నాను అప్రయత్నంగా

గ్లాసు పక్కనపెట్టి, నా పక్కకొచ్చి నిలుచుంది.

"వెళ్లిపోయావనుకున్నాను" అన్నాను నీరసంగా.

"ఎలా పోగల్ను? ఎక్కడికి పోగల్ను? " అంది నా చేతులు పట్టుకుంటూ.

"ఈ అలంకరణేమిటి? " అన్నాను మంచం చూపుతూ.

"ఇది నా తొలిరాత్రి. మీకవునో కాదో నాకు తెలియదు" అంది మనోహరంగా నవ్వుతూ.

ఆమె చిలిపితనానికి నవ్వొచ్చింది నాక్కూడా.

అదే చీర, ఆవాళ కోపంతో ఇక్కడ వదిలేసి పోయిన చీర కట్టుకొని ఉంది.

ఇద్దరం మంచంమీద కూర్చున్నాం.

"నన్ను క్షమిస్తావా? " అన్నాను దగ్గరకి తీసుకుంటూ.

"ఎందుకూ? "

"నేనేనాడూ నిన్నర్థం చేసుకోలేదు. కనీసం నువ్వు చెప్పింది వినలేదు"

"స్నేహధర్మానికి భంగం రాకుండా మీ కర్తవ్యం మీరు నిర్వహించారు. భార్యగా నా ధర్మం నెరవేరుద్దామనుకున్నాను. కానీ.. అతని లోపాన్ని కప్పిపుచ్చుకోడానికి నన్ను టార్చర్ చేసేవాడు. లోపాన్నయినా భరించగలిగాను కానీ అతని టార్చర్ భరించలేకపోయాను. నరకం చూపాడు"

'ఏం చేసేవాడు? ' అందామనుకున్నాను. ఆ సందేహానికి నేనే సిగ్గుపడ్డాను."నాకన్నీ తెలుసు సుందూ! కానీ నా మీదింత నమ్మకం నీకెవరిచ్చారు? "అన్నాను

"మీరే.." నాలో మరింతగా ఒదిగిపోతూ అంది.

ఆవేళ పున్నమి. కిటికీలోంచి కన్పించే చంద్రుడు విరహంతో నిట్టూర్పులొదుల్తున్నాడు పాపం! 'ఇక నిట్టూర్చకు చంద్రుడా!' అని కళ్లతో చెప్పాను. V